దుర్గంధభరితం


జ్ఞానాపురంలోని ఎఫ్‌సీఐ గిడ్డంగి వద్ద నివాసాల మధ్యలో సెప్టిక్ టాంక్ వ్యాన్


జ్ఞానాపురం బీఆర్‌టీఎస్ రహదారిలో గల ఎయిడెడ్ విద్యా సంస్థలకు ఆనుకుని నిత్యం పార్కింగ్ చేస్తున్న వాహనం

- బహిరంగ ప్రదేశాల్లో పడేస్తున్న సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలు (పిట్)
- జనావాసాల మధ్య ట్యాంకర్ల పార్కింగ్
- దుర్వాసనతో స్థానికుల ఇబ్బందులు
- స్పందించని జోన్-5 పబ్లిక్ హెల్త్ అధికారులు

కంచరపాలెం: జ్ఞానాపురంలోని భారత ఆహార గిడ్డంగి సంస్థ, జీఎస్ఎస్‌యూఆర్ఎం కాలనీ, ఎర్రిగెడ్డ, పైడిమాంబ కాలనీ, జ్ఞానాపురం రైల్వేస్టేషన్ రహదారి, ఎర్నిమాంబ ఆలయ రహదారి, కాన్వెంటు కూడలి ప్రాంతాల్లో లెట్రిన్ ట్యాంక్ తోడే మిషన్ల (సెప్టిక్ ట్యాంకర్లు)తో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వేరే ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన వ్యర్థాలను జ్ఞానాపురం ఎర్రిగెడ్డ, రైల్వేస్టేషన్, నేతాజీ ఫ్లైఓవర్ వంతెన, సాంబమూర్తి నగర్ పోర్టు క్వార్టర్స్, జ్ఞానాపురం ఎఫ్‌సీఐ గిడ్డంగి, డీజిల్ లోకోషెడ్, వాషింగ్‌లైన్‌కు వెళ్లే ప్రాంతాల్లో విడిచిపెట్టడంతో ఆ ప్రాంతాలు దుర్గంధభరితంగా మారుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యర్థాలను విడిచిపెట్టిన తర్వాత నివాసాల మధ్యే ఆ వాహనాలను రోజుల తరబడి వదిలేస్తుండడంతో తీవ్ర అసౌకర్యానికి గురి కావలసి వస్తుందని అటుగా ప్రయాణించే వాహన చోదకులు, పాదచారులు వాపోతున్నారు. ఇక్కడి ప్రదేశాలు పార్కింగ్‌కు అనుకూలంగా ఉండడంతో నగరంలోని ట్యాంకర్లు నిత్యం ఇక్కడే నిలుపుదల చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. స్వచ్ఛ-ఆంధ్ర సర్వేక్షణ్-2025కి విశాఖకు ర్యాంకు సాధించటానికి ఇలాంటి సంఘటనలు అవరోధాలుగా నిలుస్తాయని పలువురు చెబుతున్నారు. చీకటి పడుతున్న వేళ వ్యర్థాలు (పిట్) ఫుట్‌పాత్‌లపై గల డక్‌లు, కాలువల్లో విడుస్తున్నారు. ద్విచక్ర వాహన చోదకులు, స్థానికులు గట్టిగా అడిగితే ఎదురు సమాధానం చెబుతున్నారని ఆరోపిస్తున్నారు. కంచరపాలెంలో ట్యాంకర్ల యాజమానులు కూటమి నాయకుల అండదండలతో హవా చలాయిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

నచ్చినట్లు పబ్లిసిటీ..

జ్ఞానాపురం-కంచరపాలెం పరిసర ప్రాంతాల్లో సుమారు 15-25 సెప్టిక్ ట్యాంకర్లతో వ్యాపారాలు చేస్తున్నారు. తమ వ్యాపారాల పబ్లిసిటీ కోసం ఆయా ప్రాంతాల్లోని ఇళ్లకు స్టిక్కర్లు, విద్యుత్ స్తంభాలకు సున్నాలు వేసి ఫోన్ నంబర్లు రాయడం వంటివి చేస్తున్నారు. ఇళ్లకు అంటించిన సిక్కర్లను తొలగిస్తే గోడలు రంగులు వెలసిపోయి అంద విహీనంగా కనిపిస్తున్నాయని, విద్యుత్ స్తంభాలను నచ్చినట్లు ఉపయోగించడం వల్ల పోల్ నంబర్లు కనిపించడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత పబ్లిక్ హెల్త్ అధికారులు, ఆయా వార్డుల శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ శానిటరీ కార్యదర్శులు ట్యాంకర్ల నుంచి వ్యర్థాలు విడిచే పెట్టే వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


జ్ఞానాపురం నుంచి కంచరపాలెం వెళ్లే వంతెనపై నుంచి సెప్టిక్ వ్యర్థాలు వదులుతున్న దృశ్యం

జనావాసాల మధ్య ట్యాంకర్లు వద్దు..

నగరంలో సెప్టిక్ ట్యాంకర్ల దందా ఎక్కువగా ఉంది. నివాస ప్రాంతాల్లో ట్యాంకర్లను నిలిపి ఉంచడంతో పరిసరాలు దుర్గంధభరితంగా మారుతున్నాయి. రాకపోకలు సాగించాలంటే ముక్కు మూసుకుని వెళ్లాల్సి వస్తోంది. జనావాసాలకు దూరంగా సెప్టిక్ ట్యాంకర్లు పార్కింగ్ చేస్తే బాగుంటుంది. అధికారులు దృష్టి సారించాలి.– **సామ్యూల్**, జీఎస్ఎస్‌యూఆర్ఎం కాలనీ, జ్ఞానాపురం

అడిగితే గొడవలాడుతున్నారు..

సెప్టిక్ ట్యాంకర్‌లో నింపిన వ్యర్థాలు నగరానికి దూరంగా వెళ్లి వదిలి పెట్టాలి. వ్యాపారుల లబ్ధి కోసం ప్రజలు రాకపోకలు సాగించే ప్రాంతాల్లో విడుస్తున్నారు. అడిగితే గొడవలాడుతున్నారు. అడిగే వాడు లేకపోవడం, పబ్లిక్ హెల్త్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ట్యాంకర్ల యజమానులు హల్‌చల్ చేస్తున్నారు. – **మజ్జి జశ్వంత్**, గెడ్డవీధి, జ్ఞానాపురం.

అధికారులు స్పందించాలి..

సెప్టిక్ ట్యాంకర్ల యాజమానులు చేస్తున్న తప్పిదాలపై అధికారులు స్పందించాలి. నగరాభివృద్ధికి ర్యాలీలు నిర్వహిస్తూ.. మొక్కలు నాటుతున్నారు. ట్యాంకర్లతో మా పరిసర ప్రాంతాలు దుర్గంధభరితం చేస్తున్నారు. సంబంధిత పబ్లిక్ హెల్త్ అధికారుల దృష్టికి ఈ విషయం తీసుకెళ్లినా ప్రయోజం లేకుండా పోయింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించాలి. – **జి. చిన్నారావు**, బాబూకాలనీ, జ్ఞానాపురం.

క్లుప్తంగా

అధికారికి అభినందనలు


ప్రభాకరరావుకు అభినందనలు తెలుపుతున్న బాక్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు

డాబాగార్డెన్స్: ప్రాంతీయ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన కింజరాపు ప్రభాకరరావును విశాఖ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు నీలాపు శ్రీనివాసరావు నేతృత్వంలో అసోసియేషన్ సభ్యులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అసోసియేషన్‌కు తన సహకారం ఉంటుందని ప్రభాకరరావు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ వ్యవస్థాపకుడు కిలాని నర్సింగ్, ఉపాధ్యక్షుడు జి. రాజేష్, సీనియర్ మాస్టర్ సుధాకర్, జాయింట్ సెక్రటరీ ఎర్రయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాందేవ్, ధన, పలువురు మాస్టర్లు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తులకు పండ్లు పంపిణీ


కుష్టు రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకుడు చొక్కాకుల రాంబాబు

మహారాణిపేట: ఉమెన్ రైట్స్ కమిషన్ రాష్ట్ర కౌన్సిల్ అధ్యక్షురాలు మన్యం ఉష ఆధ్వర్యంలో బీజేపీ నాయకుడు చొక్కాకుల రాంబాబు బుధవారం ఏవీఎన్ కాలేజీ డౌన్‌లో ఉన్న కుష్టు వ్యాధిగ్రస్తులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ రైట్స్ కమిషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుద్దాల లక్ష్మి, మన్యం మురళీకృష్ణ, చితకాల రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీలలితా పీఠంలో చండీ హోమం


శ్రీలలితాపీఠంలో చండీ హోమంలో పూర్ణాహుతి సమర్పిస్తున్న పండితులు

సీతంపేట : పుష్యమాసం బహుళ అష్టమి సందర్భంగా శ్రీలలితా పీఠంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం ఉదయం చండీ హోమం, సాయంత్రం కాల భైరవ హోమం నిర్వహించారు. పండితుల వేదమంత్రాల మధ్య శాస్త్రోక్తంగా హోమాలు జరిపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ప్రతి శనివారం ఉదయం 5:30 గంటలకు సుప్రభాత సేవ, సాయంత్రం 6 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహిస్తామని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణ సేన్ తెలిపారు.

అంగన్‌వాడీ భవనం ప్రారంభం

కంచరపాలెం : జీవీఎంసీ 48వ వార్డు కైలాసపురం సూరిబాబు నగర్‌లో ఎమ్మెల్యే పి.వి ష్ణుకుమార్‌రాజు, జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ బుధవారం అంగన్‌వాడీ భవనం ప్రారంభించారు. ఈ సందర్భంగా విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక తొలిసారిగా అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.25 కోట్లతో వార్డులో పలు అభివృద్ధి పనులు చేశామన్నారు. నాటి విత్తనాలే నేటి ఫలాలుగా వార్డులో ప్రజలకు అందడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. సుమారు రూ.19 లక్షలతో నూతనంగా నిర్మించిన భవన శిలాఫలకాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు, వైఎస్సార్‌సీపీ, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలని వినతి


కమిషనర్ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న గణేష్‌కుమార్ తదితరులు

మహారాణిపేట: వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీల పదోన్నతులు, అడ్మిన్ల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వార్డు పరిపాలన కార్యదర్శుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీజే గణేష్‌కుమార్ కోరారు. బుధవారం జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌ను విశాఖ జిల్లా జీవీఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు మహదేవ్ ఆనందరావుతో కలిసి వార్డు సెక్రటరీల పదోన్నతులు, సమస్యలపై ప్రస్తావించారు. బదిలీపై వెళ్తున్న సంపత్‌కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీజే గణేష్‌కుమార్, రాష్ట్ర ట్రెజరర్ చింతకాయల బంగారురాజు, విశాఖ జిల్లా అధ్యక్షుడు సందీప్‌కుమార్, జిల్లా నాయకులు ఈ. పవన్ కుమార్, బి.వి. అశోక్ కుమార్, సాయికృష్ణ, నానాజీ, ఒ. శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టులపై పలకల అమరిక


నాడు అలా..


నేడు ఇలా

సాక్షి ఎఫెక్ట్..

దాబాగార్డెన్స్: 'విరిగిన కల్వర్టులు.. పలకలు మార్చండి' అంటూ సాక్షి ఈ నెల 21న కథనాన్ని ప్రచురించింది. జీవీఎంసీ 33వ వార్డు కుమ్మరవీధి, గోవిందరోడ్డు వేంకటేశ్వర మెట్ట ఆర్చ్ వద్ద కల్వర్టులపై పలకలు విరిగాయి. దీంతో వాహన చోదకులు, పాదచారులు గాయాల పాలవుతున్నారని, తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సంఘ సేవకుడు పచ్చిరపల్లి రాము జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదును సాక్షి ప్రచురించింది. అధికారులు స్పందించి కల్వర్టులపై విరిగిన పలకల స్థానంలో కొత్తవి అమర్చారు.

ప్రధాని ప్రకటించే వరకూ పోరాటం ఆగదు

ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు


శిబిరంలో నినాదాలు చేస్తున్న కార్మికులు

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగ సంస్థగా కొనసాగిస్తామని, ప్రైవేటీకరణ చేయబోమని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటన చేయాలని, అప్పటి వరకు ఉద్యమాలు, ఆందోళనలు ఆగవని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు వి.శ్రీనివాసరావు, బీఎస్‌రాజు, రమణమూర్తి, డి.వి.రమణారెడ్డి, కారు రమణ అన్నారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో మంగళవారం చేపట్టిన 1441వ రోజు రిలే దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. 2021 జనవరి నాటికి రూ.28వేల కోట్ల టర్నోవర్, రూ.940 కోట్ల నికర లాభంతో నడుస్తున్న విశాఖ ఉక్కును కేంద్ర ప్రభుత్వ విధ్వంసకరమైన కుట్రలు, కుతంత్రాలతో 7.3 మిలియన్ టన్నుల సామర్థ్యంతో నడిచే శక్తి ఉన్న విశాఖ ఉక్కును 1.5 మిలియన్ టన్నుల ఉత్పత్తికి దిగజార్చిందని ఆరోపించారు. ప్రభుత్వాల తీరు కత్తితో పొడిచి ఆయింట్‌మెంట్ పూసినట్టు ఉందని, ఈ ప్యాకేజీ కూడా ఇదే కోవకు చెందుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీరు మార్చుకొనేలా రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు ఒప్పించాలని, ఆ బాధ్యత తీసుకుంటామని, ఎన్నికల ముందు వాగ్దానాలు చేశారని, విస్మరిస్తే ప్రజలు క్షమించబోరన్నారు. కార్యక్రమంలో దాసరి శ్రీనివాసరావు, రాపాటి కోటేశ్వరరావు, సీహెచ్.సన్యాసిరావు, పోతయ్యారెడ్డి, నగేష్, సత్యారావు, అప్పలరెడ్డి, జగదీష్‌కుమార్, పోలీస్‌నాయుడు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాల్సిందే..


అగనంపూడి కూడలిలోని ఆటోస్టాండ్ వద్ద మాట్లాడుతున్న ఆర్ఎంవో డాక్టర్ ఉష

అగనంపూడి: రహదారి భద్రతా నియమాలు పాటించకుండా, అజాగ్రత్త, అదుపు తప్పిన వేగంతో ప్రయాణం చేస్తూ నిత్యం రోడ్డు ప్రమాదాల ప్రాంతంగా పారిశ్రామిక ప్రాంతం మారిపోతుందని అగనంపూడి ప్రాంతీయ ఆస్పత్రి ఆర్ఎంవో డాక్టర్ ఉష అన్నారు. జాతీయ రహదారి భద్రతా పక్షోత్సవాల సందర్భంగా అగనంపూడి కూడలిలోని శ్రమశక్తి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతంలో చుట్టూ ఖార్ఖానాలు, కర్మాగాలు, చిన్న చిన్న పరిశ్రమలు ఉండడంతో ఎక్కువ మంది ద్విచక్రవాహనాలపై రాకపోకలు సాగిస్తున్నారన్నారు. ఆలస్యం అయిందనో, వేగంగా వెళ్లిపోవాలనో వేగంగా వెళ్తుండడం, భారీ వాహనచోదకులు సైతం సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ, మద్యం సేవించి అదుపు తప్పిన వేగంతో ప్రయాణం సాగిస్తుండడంతో ఈ ప్రాంతంలో నిత్యం రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. దీంతో క్షతగాత్రులుగా మారిపోతున్నారని, దీని వల్ల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని వాహనచోదకులు గుర్తుంచుకొని వాహనాలు నడిపితే రోడ్డు ప్రమాదాలకు అవకాశం ఉండదన్నారు. డాక్టర్ రాజీవ్ సుస్తానా, ఐసీటీసీ కోఆర్డినేటర్ ఎం.వి.రవికుమార్, అగనంపూడి లయన్స్‌క్లబ్ కార్యదర్శి ఎం.జగదీష్, నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, మోటూరి వెంకటరమణ, తలారి వెంకటరమణ, కరణం సన్యాసిరావు, రమణ, ధర్మరాజు పాల్గొన్నారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం


ఎరుకుమాంబ అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన శ్రీఎరుకుమాంబ అమ్మవారి దేవస్థానంలో బుధవారం అర్చకుడు శ్రీనివాస్ గణపతి పూజ అనంతరం అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు జలాభిషేకం చేశారు. అర్చకుడు భక్తుల గోత్రనామాలతో విశేషపూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని నూతన చీర, పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం కూడా భక్తులు అమ్మవారికి జలాభిషేకం చేశారు. ఆలయ వర్గాలు భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్‌కు ఫర్నిచర్ వితరణ


హెచ్ఎంకు ఫర్నిచర్ అందజేస్తున్న బ్యాంకు ప్రతినిధులు

సీతంపేట : సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఐడీబీఐ బ్యాంకు సీఎస్సార్ నిధులతో 25వ వార్డు మధురానగర్‌లోని జీవీఎంసీ హైస్కూల్‌కు ఫర్నిచర్ సమకూర్చారు. 20 కుర్చీలు, లైబ్రరీకి రెండు రాక్స్, 5 క్లాస్‌రూమ్ టేబుల్స్, 10 ఫ్యాన్లు, 5 ఎల్ఈడీ లైట్లు అందజేశారు. ఐడీబీఐ బ్యాంకు సీనియర్ రీజినల్ హెడ్ కన్వాడెట్ దాస్, బ్రాంచి హెడ్ కిరణ్ ప్రాన్సిస్, ఏజీహెచ్ పి.శ్రీకిరణ్ చేతుల మీదుగా పాఠశాల హెచ్ఎం డి.శాంతి కుమారికి ఫర్నీచర్ అందజేశారు. ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు స్టీల్ సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగులకు మెడికల్ ప్రీమియం పెంపు ఉపసంహరణ, ఉద్యోగులకు జీతాలు వెంటనే చెల్లించాలన్న డిమాండ్లపై గురువారం ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ వద్ద ధర్నా చేయనున్నట్టు స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె. అయోధ్యరామ్, ప్రధాన కార్యదర్శి యు. రామస్వామి తెలిపారు. ధర్నాను విజయవంతం చేయాలని వారు కోరారు.

అలరించిన త్యాగరాజ కీర్తనలు


త్యాగరాజ కీర్తనలు ఆలపిస్తున్న గాయనీ గాయకులు

మురళీనగర్ : మురళీనగర్ రామాలయంలో సర్వేజనా సుఖినోభవంతు బృందం బుధవారం ఆలపించిన త్యాగరాజ కీర్తనలు భక్తులను అలరించాయి. సంస్థ బృందం నిర్వహించే త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో భాగంగా 178వ త్యాగరాజ కీర్తనల ఆలాపనా కార్యక్రమం నిర్వహించారు. ముందుగా మహిళలు కోలాటం ప్రదర్శించారు. అనంతరం త్యాగరాజ కీర్తనలు ఆలపించారు. ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టీఎస్ రెడ్డి, ఎస్.వరప్రసాద్, పి.శ్రీనివాసరావు, జీవీ ఆనందరావు, ఎస్ఎంకే మోహన్, విజయలక్ష్మి పాల్గొని కార్యక్రమం నిర్వహణకు సహకరించారు. సర్వేజనా సుఖినోభవంతు ప్రతినిధి సత్యమాధవి పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు అభినందన



ఎన్‌సీసీ క్యాడెట్లతో ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల, గీతాంజలి

డాబాగార్డెన్స్: రఘు ఇంజినీరింగ్ కాలేజీలో ఈనెల 20 నుంచి 23 వరకు జరిగిన యాన్యువల్ ట్రైనింగ్ క్యాంపులో పాల్గొన్న 27 మంది విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల 2 ఆంధ్రా గరల్స్ ఎన్‌సీసీ క్యాడెట్లను ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల అభినందించారు. ఈ శిక్షణలో డ్రిల్, ఫైరింగ్ వంటి వివిధ రంగాల్లో శిక్షణ పొందడమే కాక సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ చూపారన్నారు. శిక్షణలో ప్రతిభ చూపి, సర్టిఫికెట్లు పొందిన క్యాడెట్లను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ అధికారి గీతాంజలి, పలువురు క్యాడెట్లు తదితరులు పాల్గొన్నారు.

గుడివాడకు అభినందనలు


అమర్నాథ్‌కు అభినందనలు తెలుపుతున్న నాయకులు

డాబాగార్డెన్స్: వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్నాథ్‌ను పార్టీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చోడవరం నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించడంపై అభినందనలు వెల్లువెత్తాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీ అభివృద్ధి శాఖ మాజీ డైరెక్టర్ పీతల వాసు, పలువురు పార్టీ నాయకులు బుధవారం అమర్నాథ్‌ను కలిసి అభినందనలు తెలిపారు.

ఆపన్నులకు అభయహస్తం


కుటుంబ సభ్యులకు మదీనావలిని అప్పగిస్తున్న ఏయూటీడీ సిబ్బంది


వసతిగృహంలో ఆశ్రయం పొందిన వ్యక్తి

సీతమ్మధార: మానసిక వ్యాధితో బాధపడుతున్న మదీనావలిని ఏయూటీడీ సిబ్బంది కుటుంబ సభ్యులకు అప్పగించారు. 1వ పట్టణ పోలీసుల సహకారంతో సెప్టెంబర్ 2023లో ద్వారకానగర్‌లోని టీఎస్సార్ కాంప్లెక్స్‌లో గల జీవీఎంసీ-ఏయూటీడీ వసతి గృహానికి తరలించారు. తను యుక్త వయసులో ఉన్నప్పుడు తల్లి చనిపోవడంతో తండ్రి రెండో పెళ్లి చేసుకుని వదిలి వెళ్లిపోయాడు. దీంతో చెల్లి, తమ్ముడిని చూసుకుంటూ కుటుంబ భారాన్ని మోసేది. పెట్రోల్ బంక్ లో పనిచేస్తూ చెల్లి పెళ్లి చేసింది. సొంత ఇల్లు కూడా కట్టింది. తమ్ముడు మూడు సంవత్సరాలుగా కనిపించకుండా పోవడంతో మొబైల్ ఫోనుకి బానిస అయి మానసిక ఆరోగ్యం దెబ్బతింది. ఏయూటీడీ అందించిన సేవలు, శ్రద్ధా బృందం చికిత్సతో చివరికి వ్యాధి నయం కావడంతో కంచరపాలెం దరి బర్మాకాంపు దగ్గర శ్రీనివాసనగర్‌లో ఉన్న పిన్ని మరియమ్మకి క్షేమంగా అప్పగించారు.

శ్రీకాకుళం వ్యక్తికి ఆశ్రయం..

శ్రీకాకుళంలోని ఆముదాలవలసకు చెందిన అన్నపు ప్రసాద్ (54) కుటుంబ కలహాల వల్ల ఇల్లు వదిలి విశాఖ వచ్చేశాడు. ప్రస్తుతం భిక్షాటన చేసుకుంటూ బతుకుతున్నాడు. ఈ నేపథ్యంలో ఇతను దొండపర్తి ఫుట్‌పాత్‌పై ఉండగా ఏయూటీడీ సిబ్బంది చూసి నిరాశ్రయుల వసతిగృహానికి తరలించారు. ఇతనికి ఏదైనా సెక్యూరిటీ ఏజెన్సీలో గార్డుగా ఉపాధి చూపించే ప్రయత్నం చేస్తున్నట్లు సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు.

పరశురామరాజుకు సత్కారం


పరశురామరాజును అభినందిస్తున్న రూపాకుల రవికుమార్ తదితరులు

మహారాణిపేట: బీజేపీ పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన మంతెన మురళీ నాగ పరశురామరాజుని పార్టీ నాయకులు సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ వైద్య విభాగం రాష్ట్ర కన్వీనర్ రూపాకుల రవికుమార్, పద్మనాభం మండల బీజేపీ అధ్యక్షురాలు తమటపు నాగమణి ఆధ్వర్యంలో పరశురామరాజును సత్కరించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ పరశురామరాజు అరకు పార్లమెంటు బీజేపీ ఇన్‌చార్జిగా పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. మండల అధ్యక్షురాలు తమటపు నాగమణి మాట్లాడుతూ పరశురామరాజు నాయకత్వంలో మండలంలో పార్టీ అన్ని విభాగాల్లో అభివృద్ధి చెందుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల మాజీ అధ్యక్షుడు రెడ్డిపల్లి శ్రీనివాసరావు, నాయకులు మత్స సోమేశ్వరరావు, సిరిపరపు వెంకట్రావు, చప్ప కృష్ణ, పాలూరి కష్టారావు, మరగడ గౌరీ రెడ్డి, బర్ల కనక, చలుమూరి ఎర్నాయుడు, కడితి ఈశ్వరరావు, సారిక ఎన్ని బాబు, జొన్నాడ గౌరీ అప్పారావు, కళింగపటపు అప్పన్న, గుడివాడ నరసింహులు, గెద్ద అప్పలనాయుడు, కొత్తకోట అశోక్, కళింగపటపు బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంవీడీఎం హైస్కూల్లో సోలార్ ప్యానెల్ ఏర్పాటు


సోలార్ ప్యానెల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

డాబాగార్డెన్స్: వేదాంత కంపెనీ రూ.4 లక్షలతో పాతనగరం 39వ వార్డులో గల ఎంవీడీఎం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సోలార్ ప్యానెల్‌ను స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వేదాంత కంపెనీ ప్రతినిధులను ఎమ్మెల్యే అభినందించారు. వేదాంత కంపెనీ సామాజిక కార్యక్రమాల్లో భాగంగా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. నియోజకవర్గ పరిధిలో ఎంవీడీఎం స్కూల్‌తో పాటు ఉమెన్స్ కళాశాల, మిగిలిన పాఠశాలల్లో కూడా పలు కార్యక్రమాలు చేపట్టాలని వేదాంత సీఈవోను కోరారు. అనంతరం సీఈవో సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే సూచనల మేరకు పలు స్కూళ్లతో పాటు ఆరోగ్యానికి సంబంధించి సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. వార్డు కార్పొరేటర్ సాధిక్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా 39వ వార్డు చిలకపేటలో స్ట్రీట్ లైట్స్ వెలగకపోవడంతో స్థానికులు ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. సంబంధిత అధికారులతో మాట్లాడి వీధిలైట్లు వెలిగేలా చేసిన ఎమ్మెల్యేకి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.